క్లుప్తంగా

విద్యార్థులకు వితరణ



సామగ్రి అందజేస్తున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు ఉపేందర్ రెడ్డి ఆర్థికసాయంతో ఆదివారం ఖమ్మం రోటరీ నగర్ ప్రభుత్వ పాఠశాల పదో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, స్కేల్స్, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీంద్రరావు మాట్లాడగా హెచ్ఎం మధు, సంస్థ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రావు, గజేంద్రుల నాగేశ్వరావు, కోశాధికారి గోవర్దన్, జెల్లా లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధ్యాయులు, కవి, రచయిత పొత్తూరి సీతారామారావు రచించిన 'భావనఝురి' పుస్తకాన్ని ఆదివారం ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ లో కవులు, రచయితలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవి దర్భశయనం శ్రీనివాసాచార్య తొలిప్రతిని సీతారామారావు మాతృమూర్తికి అందించారు. ఈ కార్యక్రమంలో కవులు ముచ్చా శ్రీనివాసరావు, కన్నెగంటి వెంకటయ్య, జీవన్, ఎస్వీఆర్ పురుషోత్తమరావు, షఫీ సయ్యద్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కోండ్రు బ్రహ్మం, సుజాత, సుచరిత, కృష్ణ, నాగేశ్వరరావు, శ్యామ్, నామా పురుషోత్తం, లెనిన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రాయల'కు పదవిపై సంబురాలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి: టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియామకంపై ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు సెంటర్‌లో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్నపూసల సీతారాములు, మైశాశంకర్, జెర్రిపోతుల అంజిని, సుదర్శన్, గుండా బ్రహ్మం, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, ముక్కంటి, దోసపాటి శేఖర్, యడవల్లి నాగరాజు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, వున్నం వెంకటేశ్వర్లు, గుండు మహేష్, గురునాథం, వడ్డె జగన్, పవన్, సూరేపల్లి రవి, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	గామీ
సాయిరాం	తంత్ర, పరతులు వర్తిస్తాయి
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	40	చుక్కకూర	3
బీర	46		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
నాటు చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

నేలకొండపల్లి: భైరవునిపల్లిలో పశువులు మేస్తున్న వరి పొలం



వ్యథసాయమే..!

తగ్గిన యాసంగి విస్తీర్ణం
- అపరాల సాగుపై మొగ్గు చూపని రైతులు
- నీటి కొరతే కారణమంటున్న అధికారులు
- కొందరు బోర్లు వేయించేందుకు ఆసక్తి
- పశువుల మేతగా వదిలేస్తున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వ్యవసాయం దారుణంగా దెబ్బతీసింది. పంటల సాగు అంచనాలు తలకిందులయ్యాయి. గతేడాది కాస్త వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పెరగడంతో రైతులు గతంలో మాదిరిగానే ఈ ఏడు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. కానీ ఈ ఏడు సరైన వర్షాలు లేకపోవడంతో యాసంగి విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. నీటి కొరత కారణంగా ఏ ఒక్క పంట ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోయాయి. కొందరు రైతులు బోర్ల వైపు మొగ్గు చూపగా.. మరికొందరు పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో వేస్తున్న బోరు

కామేపల్లి/నేలకొండపల్లి: యాసంగి సాగు గణనీయంగా తగ్గింది. కొండంత ఆశతో రైతులు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి పొలాలు నిలువునా ముంచాయి. వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు పూర్తిగా పడిపోయాయి. సుమారు మూడు నెలల క్రితం తేలికపాటి చిరుజల్లులు తప్ప భారీ వర్షం పడలేదు. దీంతో చెరువులు, బావులు, కుంటల్లో నీళ్లు అడుగంటాయి. జిల్లాలోని పలు ఆయకట్టు పరిస్థితి దారుణంగా ఉంది. వేలాది ఎకరాల్లో సగం కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇక చేసేది లేక కళ్లేదుటే పంటలను పశువులకు అప్పగిస్తున్నారు.

బోర్లనే నమ్ముకుని..
మండలాల్లో కాల్వలు, వాగులు, చెరువుల్లో నీరు లేకపోవడంతో సాగు నీరు అందే పరిస్థితి లేదు. దీంతో కొంతమంది రైతులు పంటలను కాపాడుకునేందుకు ఆర్థిక పరిస్థితి కలిగిన వారు బోర్లు వేసేందుకు ముందుకొస్తున్నారు. కాగా, కనీసం ఒక బోరు వేయాలంటే దాదాపు రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. కొందరి బోర్లకి నీళ్లు పడకపోవడంతో మూడు, నాలుగు బోర్లు వేయిస్తూ.. ఆర్థికంగా చిత్తవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కొరతతోనే..
గతేడాది యాసంగి సీజన్‌లో పచ్చగా కనిపించే పంటపొలాలు నేడు బీడు భూములుగా బోసిపోయి కనిపిస్తున్నవి. మిర్చి అత్యధిక ఎకరాల్లో సాగు చేయడంతో మిర్చి పంటకు సాగునీరు ఎక్కువగా అవసరం ఉండడంతో యాసంగిలో సాగు చేపడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కొందరు రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. గతేడాది మిర్చి, యాసంగి పంటల పనులు మే వరకు పూర్తి కాగా ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికే పనులు పూర్తయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. కూలీలకు కూడా మార్చి చివరి నాటికే పనులు దొరికే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యాన నీటి కొరత కారణంగానే యాసంగిలో పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపలేదని వ్యవసాయాధికారులు అంటున్నారు.

అపరాలపై అనాసక్తి...
అపరాలకు మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ యాసంగి సాగుపై రైతులు దృష్టి సారించలేదు. బావులు, బోర్లలో నీరు తక్కువగా ఉండడంతో యాసంగిలో అపరాల సాగు చేసేందుకు రైతులు కష్టంగా మారింది. అయినా కొంతమంది రైతులు ఆసక్తి చూపగా.. కామేపల్లి మండలంలో గతేడాది మొక్కజొన్న 426, పెసర 101, జొన్నలు 42, పత్తి 12, మినుము 7, బొబ్బెర 2, వేరుశనగ ఒక ఎకరంలో సాగు చేయగా.. ఈ ఏడాది మొక్కజొన్న 401, పెసర 288, జొన్నలు 73, మినుము 17, బొబ్బెర 22, వేరుశనగ 22, నువ్వులు 05, గోధుమ 02 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



కామేపల్లి: యాసంగిలో సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ మున్ని

ఎండిన వరి సాగు..
కామేపల్లి మండలంలో గతేడాది యాసంగిలో 1,400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయగా.. ఇందులో 727 ఎకరాల్లో వరి సాగైంది. ఈ ఏడాది కేవలం 1,086 ఎకరాల్లోనే పలు రకాల పంటలను సాగు చేయగా ఇందులో 256 ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని పాలేరు పాత కాల్వ పరిధిలోని 8,500 ఎకరాల్లో వరి సాగు చేయగా.. కూసుమంచి మండలంలో 7,127 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో చాలా వరకు ఎండిపోయాయని వ్యవసాయాధికారులు అంటున్నారు.

పంటంతా పశువుల మేతకే..



సాగుకు వేలాది రూపాయలు ఖర్చు చేశా.. అయినా పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. దీంతో నాలుగు ఎకరాలు వరి పంటను పశువుల మేతకు వదిలేశా. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. కనీసం పెట్టిన పెట్టుబడి అయినా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.
– నూక వెంకటేశ్వర్లు, రైతు, భైరవునిపల్లి

ఇక్కట్ల కారణంగానే..



యాసంగిలో పంటల సాగుకు అనుకున్న స్థాయిలో పరిస్థితులు లేవు. అందుకే పంటలు సాగు చేయలేదు. గత ఏడాది పెసర రెండెకరాల్లో సాగు చేశా. కానీ ఈ ఏడాది యాసంగిలో ఆ పంట జోలికి పోకుండా ఒక్క ఎకరం కూడా సాగు చేయలేదు.
– ధరావత్ మాన్‌సింగ్‌నాయక్, పండితాపురం

యాసంగి సాగు తగ్గింది..



గతేడాదితో పోల్చితే యాసంగి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. నీటి ఎద్దడి ఎదురవుతుందనే ముందస్తుగా రైతులు యాసంగి సాగుకు చేపట్టలేదు. నీటి సౌకర్యం ఉన్నా ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేశారు.
– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి
- చెక్‌పోస్టుల పరిశీలన



చెక్‌పోస్టులో అధికారులకు సూచనలిస్తున్న ఆర్ఓ రాజేశ్వరి

నేలకొండపల్లి: ఎన్నికల విధులపై అధికారులు అప్రమతంగా ఉండాలని పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి సూచించారు. మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బందికి, వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నియోజకవర్గంలో నాయకన్‌గూడెం(కూసుమంచి), పైనంపల్లి (నేలకొండపల్లి), నేలకొండపల్లి మండల కేంద్రంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. . ప్రతీ పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, తహసీల్దార్ గౌరిశంకర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కృతజ్ఞతలు తెలుపుతున్న బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి సంఘ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్వర్ణభారతి కళ్యాణమండపం వద్ద కమ్మ కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహంతో పాటు కమ్మ సంఘం దివంగత నేతల విగ్రహాలకు పూలమలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ... కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నుండి ముచ్చా విజయబాబు, రాయల నాగేశ్వరరావులతో పాటు మన్నే సతీష్‌కుమార్ ను రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించారని, వారికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం ప్రధాన కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, కోశాధికారి నల్లమోతు రఘు, సహాయ కార్యదర్శి మందటి నరేష్‌చౌదరి, కార్యవర్గ సభ్యులు ఊట్ల మురళి, నల్లమల రంజిత్, బండి మాధవరావు, నున్నా నవీన్, తాళ్లూరి సృజన్‌కుమార్, చింతనిప్పు కృష్ణ చైతన్య, నల్లమల ఆనంద్, నూకవరపు కోటేశ్వరరావు, గొడవర్తి శ్రీను, బొప్పన్న కృష్ణ, నల్లమల వేణు, నార్నే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న విఠల్‌రావు

కామేపల్లి: రాష్ట్రంలోని పేద ప్రజల జీవితాల్లో కాంగ్రెస్ పార్టీ వెలుగులు నింపిందని పార్టీ నాయకుడు, ప్రముఖ సీనియర్ అడ్వకేట్ బోడేపూడి విఠల్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పండితాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేద ప్రజల ఆదరణ,అభిమానం,దీవెనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి పేద ప్రజలకు భరోసా కల్పించిందన్నారు. రైతుబంధు పేరుతో వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు అందించి వారికి మేలు చేశారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు గిరిజన సంఘం జిల్లా నాయకులు బానోత్ నరసింహానాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకపోతుల మహేష్‌గౌడ్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మేకల మల్లిఖార్జున్ రావు, బండి ఉపేందర్, లక్ష్మీనర్సు, చల్లా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



తిరుమలాయపాలెం: హాల్‌టికెట్ నంబర్లను ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

కూసుమంచి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం కానుండగా ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి బీవీ రామాచారి తెలిపారు. మండల వ్యాప్తంగా 473 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరువుతుండగా కూసుమంచిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ,బీ సెంటర్లు, నాయకన్‌గూడెంలో ఉన్నత పాఠశాలలో మరో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

కామేపల్లి: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కామేపల్లి, ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని కామేపల్లిలో 169, ముచ్చర్ల–జాస్తిపల్లిలో 119 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

తిరుమలాయపాలెం: మండలంలో సోమవారం నుండి ప్రారంభమయ్యే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఎంఈఓ బి.వి రామాచారి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 486 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. తిరుమలాయపాలెం, పిండిప్రోలు, బీరోలు, సుబ్లేడు పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

ఎంపీ టిక్కెట్ జావీద్‌కు ఇవ్వాలి

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌కు ఇవ్వాలని ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మైనార్టీ శ్రేణులు తమ నిరసన వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ జిల్లా మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ అనేక అటుపోటులను తట్టుకుని జావీద్ నిలబడ్డారన్నారు. జిల్లాలో సుమారు 1లక్షా 50వేల మంది మైనార్టీ ఓటర్లు ఉన్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని జావీద్‌కు ఎంపీ సీటును కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ చైర్మన్ గౌస్, రబ్బానీ, వసీం, ముఖ్రం, అహ్మద్, ముజాహిద్ ఇతర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పరామర్శిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ఖమ్మంరూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బైక్‌పై తిరుగుతూ ఇటీవల మృతి చెందిన, ప్రమాదాల్లో గాయపడిన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరూ అధైర్య పడొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్ది మల్లారెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, కన్నేటి నర్సింహారావు, తోట చినవెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, బండి జగదీష్, బత్తిని యాలాద్రి, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో దయాకర్‌రెడ్డి
నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందుకి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షలో నగరంలోని ముస్తాఫానగర్‌లోని శ్రీ చైతన్య (లోటస్ క్యాంపస్)విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లువిద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. ఆదివారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్తీక్ కుమార్ లెనోవో ట్యాబ్ గెలుచుకోగా సాయి విశ్వనాథ్ గిఫ్ట్ బాక్స్, 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ శ్రీదేవి, డీన్ ప్రవీణ్ పాల్గొన్నారు.

వేడుకలకు సిద్ధం..!

రేపటి నుంచి పండితాపురంలో రామలింగేశ్వరుడి జాతర
- నాలుగు రోజులపాటు ఉత్సవాలు
- 20న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం





ముస్తాబైన శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి (ఇన్‌సెట్) కొలువుదీరిన స్వామివారు

కామేపల్లి: భక్తుల పాలిట కొంగుబంగారంగా ఉన్న మండలంలోని పండితాపురం గ్రామ శివారులో ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వేడుకలకు సిద్ధం అయ్యింది. రేపటి నుంచి(మంగళవారం) నాలుగురోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. దీనికోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో ప్రతీ ఏటా సాంప్రదాయబద్ధంగా శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. మహా శివరాత్రి తర్వాత వచ్చే ఫాల్గుణశుద్ధ దశమి రోజున జాతర ప్రారంభమై త్రయోదశితో ముగుస్తుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయంలో శివలింగంతో పాటు శివపార్వతుల విగ్రహాలు, వినాయక, ఆంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుడు దర్శనమిస్తారు. ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణ చేసి ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

నాలుగు రోజులు పాటు ఉత్సవాలు..
శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు నాలుగు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. మార్చి 19న ఆలయం తోరణాలంకరణ, స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయుట, అంకురార్పణ, అఖండ దీపారాధన, 20న మహావ్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం,రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణం, 21న స్వామి వారి గ్రామోత్సవం, 22న పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలన..
పండితాపురం గ్రామ శివారులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ కోరారు. ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. జాతర ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



కోరిన కోర్కెలు తీర్చే శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామిగా ప్రసిద్ధి చెందిన ది.నాలుగు రోజుల పాటు జరగనున్న కల్యాణ మహోత్సవాలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఈ కల్యాణ మహోత్సవానికి తరలిరానున్నారు.
– మేకల మల్లిబాబుయాదవ్, డీసీసీబీ డైరెక్టర్

అంగరంగ వైభవంగా కల్యాణం..



శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా జరుగుతుంది.శివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు అందుకున్న శివపార్వతులు శివరాత్రి తర్వాత వచ్చే ఫాల్గుణశుద్ధ దశమి రోజున జాతర ప్రారంభమై నాలుగు రోజులు జరుగుతుంది. – మేకపోతుల మహేష్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు